

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



భూములను సర్వే చేస్తున్న అధికారులు

నంబులపూలకుంట : మండలంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాలకు స్థలం కొరత ఉన్నందున ప్రభుత్వ స్థలాలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి కట్టడాలు చేయకూడదన్నారు. త్వరలోనే ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకున్న తర్వాతే లేఔట్లు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుల నియామకం

- 'అనంత'కు పైలా నరసింహయ్య
- సత్యసాయి'కి శంకర నారాయణ
- రీజనల్ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు గురువారం నాడు అధికారిక ప్రకటన వెలువడింది. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పైలా నరసింహ్యను నియమించగా, సత్యసాయి జిల్లాకు సంబంధించి మాజీ మంత్రి మాల గుండ్ల శంకర నారాయణను నియమించారు. ఈ ప్రాంత కో ఆర్డినేటర్‌గా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డిని నియమించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగానూ ఉన్నారు. ఇక పార్టీ బాధ్యతలను ఆయన చూడనున్నారు.

ఎన్నికలకు శ్రేణులను సమయత్తం చేయగలరా..?

అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రణాళికల్లో ఉన్నాయి. 2024లో సాధారణంగా ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. ఒకవేళ ముందస్తుగా వెళ్తే ఇంకా ముందుగానే ఎన్నికలు వస్తాయి. ఈ ఎన్నికలను వైసిపి కొత్త అధ్యక్షులు ఏ మేరకు సమన్వయం చేయగలరన్నది చూడాల్సి ఉంది. ఇది వరకు అనంతపురం జిల్లాకు వైసిపి అధ్యక్షులుగా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఉండేవారు. వ్యక్తిగత, కుటుంబ కారణాలతో అధ్యక్షుడిగా కొనసాగలేనంటూ ఆయన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి చెప్పి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అధిష్టానం కొత్త అధ్యక్షున్ని నియమించింది. అందులో భాగంగా అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పైలా నరసింహయ్యను నియమించారు. జిల్లాలో పైలా నరసింహయ్య ఏ మేరకు నేతలందరినీ సమన్వయం చేయగలరన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇప్పటికే ఆయన సొంత ప్రాంతమైన తాడిపత్రి నియోజకవర్గంలోనే అక్కడి ఎమ్మెల్యే పెద్దారెడ్డితో సరైన సఖ్యత లేదని పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. పైలా ప్రారంభంలో వైసిపిలో చేరినప్పటికే మధ్యలో ఆయన పార్టీని వీడి తిరిగి మళ్లీ వైసిపిలో చేరారు. ఇప్పుడు ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను పార్టీ భుజానపెట్టింది. జిల్లాలో కొద్ది మంది నేతల మధ్య సరైన సమన్వయం లేదు. ఒక్కోసారి బాహాటంగానే ఇవి కనపించాయి. ఇటువంటి సమయంలో సీనియర్ నాయకులను కలుపుకుని పార్టీని నడిపించడం పెద్ద సవాల్‌గానే మారనుంది. ఇక సత్యసాయి జిల్లాకు మాజీ మంత్రి శంకర నారాయణకు తిరిగి బాధ్యతలు అప్పగించారు. మంత్రి పదవుల మార్పు సమయంలోనే పదవులు కోల్పోయే వారికి పార్టీ బాధ్యతలిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శంకర నారాయణకు సత్యసాయి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. శంకర నారాయణ గతంలోనూ ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. పార్టీకి విధేయుడిగా, ముఖ్యమంత్రి నమ్మకాన్ని చూరగొనడంతో ఆయన తొలి విడతలోనే మంత్రి పదవి వరించింది. ఆయనకు అధిష్టానం వద్ద మంచి పలుకుబడే ఉందని చెప్పొచ్చు. అయితే నేతల మధ్య సమన్వయం చేసే విషయంలో ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది ప్రశ్నార్థకమనే చెప్పాలి. ఇప్పటికే హిందూపురంలో పెద్దఎత్తున విభేదాలు కొనసాగుతున్నాయి. నేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇక్బాల్ మధ్య ప్రత్యక్ష పోరు సాగుతోంది. శంకర నారాయణకు సొంత నియోజకవర్గం పెనుకొండలోనే కొంత మంది నుంచి అసంతృప్తి ఉంది. ఇతరచోట్ల కూడా ఇదే పరిస్థితులున్నాయి. వీటిని సరిచేసే పార్టీని ఏకతాటిపై నడిపించడం కత్తిమీద సామే అవనుంది.

పెద్దిరెడ్డే కీలకం..

ఉమ్మడి జిల్లాలో వైసిపి అధ్యక్షులిద్దరూ నాయకులు అందరినీ సమన్వయం చేసే పరిస్థితి ఉందా.? లేదా.? అన్న ప్రశ్నలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూపంలో సమాధానం విన్పిస్తోంది. వైసిపిలో సీనియర్ నాయకుడు, మంత్రి అయిన పెద్దిరెడ్డి జిల్లాలోని అందరి నేతలతో పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాయకులను సమన్వయం చేసేందుకు రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైనే అందరూ ఆధారపడాల్సి ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆయన సీనియర్ నాయకుడే కాకుండా పార్టీ అధిష్టానంలో కీలకమైన వ్యక్తుల్లో ఒకరు కావడం చాలా వరకు సమస్యలను పరిష్కరిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

సరి చేయమంటే.. సస్పెండ్ చేశారు..!

- లోపాన్ని చెప్పిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు
- ఉన్నతాధికారుల ఆదేశమన్న డిఇఒ
- అధికారులపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం



ముఖహాజరు నమోదుకు తలపై వెంట్రుకుల, మీసాలతో ఉన్న ఉపాధ్యాయుడు ఆదినారాయణ



గుండు అనంతరం ఆన్‌లైన్‌లో ముఖహాజరు కోసం ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుడు ఆదినారాయణ

ప్రజాశక్తి-హిందూపురం

'పాఠాలు సరిగా బోధించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటారు... పాఠశాలకు రాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహిరిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవడం మనం చూసి ఉంటాం. ఇలాంటి వాటికి విరుద్ధంగా సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహరించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి ఫేస్‌యాప్ ఆన్‌లైన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించమన్నందుకు ఏకంగా ఆ ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేసి ప్రభుత్వంపై వారికున్న స్వామిభక్తిని చాటుకున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించమని కోరడమే ఆయన చేసిన నేరం అయినట్లు అతనిపై కక్షగట్టి చర్యలు తీసుకున్నారు. ఈ సస్పెన్షన్ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని మేళాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎల్ఎన్.ఆదినారాయణ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన మొక్కు తీర్చుకోవడం కోసం తిరుపతికి వెళ్లాడు. ఈ సమయంలో తలనీలాలు సమర్పించాడు. తిరిగి పాఠశాలకు గుండుతో వచ్చారు. గుండుతో వచ్చిన ఆయన హాజరును పాఠశాల ఫేషియల్ యాప్(ముఖహాజరు)లో నమోదు కాలేదు. ముఖహాజరు ప్రారంభ నమోదు సమయంలో ఆయన తలకు వెంట్రకలు, మూతిపై మీసాలు ఉన్నాయి. తిరుపతి వెళ్లొచ్చిన తరువాత జుట్టు, మీసం లేని కారణంగా ముఖహాజరు నమోదు కాలేదు. ఈ విషయాన్ని సదురు ఉపాధ్యాయుడు ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయుని ప్రమేయం లేకుండానే ఈ విషయం పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయ్యింది. దీనిపై విద్యాశాఖ అధికారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు చేసిన ఈ పని నేరం అన్నట్లుగా భావించారు. ఇందుకు సంబంధించి ఈ నెల 17వ తేదీన ఉపాధ్యాయుడికి జిల్లా విద్యాశాఖ అధికారులు మెమో జారీ చేసి, వివరణ కోరారు. ఇందుకు సంబంధించి ఉపాధ్యాయుడు ఎంఇఒ ద్వారా వివరణ పంపాడు. కాగ ఈ వివరణ సరిగా లేదంటూ జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి గురువారం నాడు ఉపాధ్యాయుడు ఆదినారాయణను ఏకంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. యాప్‌లోని లోపాలను సరిచేయమన్నందుకు సస్పెండ్ చేయడం ఏమిటంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తక్షణం ఆయన సస్పెన్షన్‌ను ఎత్తేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని తెలియజేశారు.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే... డిఇఒ మీనాక్షి

హిందూపురం పురపాలక సంఘం మేళాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదినారాయణను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సస్పెండ్ చేశామంటూ డిఇఒ పాత్రికేయుల ఎదుట పేర్కొన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మేళాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదినారాయణ అనే ఉపాధ్యా యున్ని ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకే సస్పెండ్ చేశామ న్నారు. ఫేస్ యాప్ రిజిస్టర్‌లో సాంకేతికలోపాలు కొన్ని ఉన్న మాట వాస్తవమే అన్నారు. అయితే ఈ అంశాన్ని ఉపాధ్యాయుడు బహిర్గతం చేయడం, ఆ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారిందన్నారు. ఉపాధ్యా యుడు ముఖహాజరు పడని రోజు ఎటువంటి సాంకేతిక లోపం లేదన్నారు. ఫోన్‌లో నెట్‌వర్క్ సమస్య రావాడం వల్ల ఇలా జరిగి ఉండొచ్చన్నారు. ఈ విషయాన్ని బహిర్గతం చేయడం సరైన పద్ధతి కాదని భావించిన ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేయాలని ఆదేశించారన్నారు.

ప్రభుత్వం నుంచి ఏ సహకారమూ లేదు..

అందుకే సాగు భూములను సోలార్‌కు ఇస్తున్నాం.. - ఎపి రైతుసంఘం బృందం ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-కనగానపల్లి

'సాగు చేస్తుంటే కనీసం పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు.. పెట్టుబడులు ఎక్కువయ్యాయి.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదు.. చేసేది లేక సోలార్ ప్రాజెక్టుకు భూములను లీజుకు ఇస్తున్నాం..' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జె.వి రమణ, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తల కదిరప్ప నేతత్వంలో గురువారం మండల పరిధిలో సోలార్‌కు భూములు సేకరిస్తున్న గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పదేళ్లుగా పంటలు లేక.. పెట్టిన పెట్టుబడులు రాక.. నష్టపోయి వ్యవసాయం బరువై సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇవ్వడానికి అంగీకరిస్తున్నామని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం వ్యవసాయానికి కావాల్సిన వనరులు, రాయితీ పనిముట్లు, సబ్సిడీలు, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. ఈనేపథ్యంలో సోలార్‌పవర్ ప్రాజెక్టుకి భూమి ఇస్తే సంవత్సరానికి రూ.30వేలు ఇస్తామని చెబుతున్నార తప్ప గ్రామాల్లో ఎక్కడా రైతులను కూర్చోబెట్టి చర్చించి అభిప్రాయ సేకరణ చేయలేదన్నారు. మరోవైపు బోర్లు బావులు, పలు వక్షాలకు అంచనా వేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రధానంగా పేరూరు డ్యామ్‌కు హంద్రీనీవా ద్వారా నీటిని తీసుకోవడానికి వందల ఎకరాలు భూమి కోల్పోయిన రైతులకు నేటికీ పరిహారం ఇవ్వలేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధి స్పందించి పరిహారం ఇప్పిచ్చే విధంగా కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



రైతుసంఘం, సిఐటియు నాయకులతో గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

రైతు సంక్షేమమే జగనన్న లక్ష్యం

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

రైతన్నల సంక్షేమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని డిడిఎ వెటర్నరీ శిక్షణ కేంద్రంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో సంభాషిస్తూ సిహెచ్‌సి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఉద్యానవన శాఖలో రైతులకు ఇస్తున్న ప్యాక్‌హౌస్, డ్రిప్పు, స్ప్రింక్లర్ సబ్సిడీలు, వాటి పనితీరు గురించి వివరించారు. పట్టు పరిశ్రమ శాఖలో షెడ్లు, మల్బరీ పంటకు ఇస్తున్నటువంటి సబ్సిడీల గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామస్థాయి, మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి పనితీరును పరిశీలించారు. ఈ సమావేశంలో డివిజన్ స్థాయి సలహా మండలి ఛైర్మన్ బసిరెడ్డి, జెడ్పిటిసి నాగభూషణం, వైస్ ఎంపిపి రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఇమ్రాన్, వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్, రైతు సంఘం నాయకుడు సిద్ధారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

పేద రైతులకు భూములను కేటాయిస్తాం

ఆర్‌డిఒ తిప్పేనాయక్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం డివిజన్ పరిధిలో భూమిలేని పేద రైతులకు వ్యవసాయ భూములను కేటాయిస్తామని ఆర్టీఓ తిప్పేనాయక్ తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక ఆర్టీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఏడు మండలాలకు సంబంధించిన వీఆర్వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గతంలో సూచించిన మేరకు ఇంతవరకు మండలాల్లో ప్రభుత్వ భూముల విస్తీర్ణం ఎంత, ఇంతవరకు భూమిలేని నిరుపేద రైతులను గుర్తించిన వారి వివరాలు, భూములు విస్తీర్ణం తదితర వాటిపై తహశీల్దార్లతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఏడు మండలాల్లో 2,167 మంది భూమిలేని రైతులను గుర్తించామని, వారందరికీ 4,634 ఎకరాల్లో భూములను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కతిజెన్ కుఫ్రా, ఉప తహశీల్దార్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా స్వచ్ఛ సంకల్పం

కలెక్టర్ బసంత్ కుమార్



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రామీణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడానికి తీసుకొచ్చిన జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు పరుస్తామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర పంచాయతీ, గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామకంఠం సర్వే పనులు, పారిశుద్ధ్యం, విద్యుత్ బల్బులపై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల విద్యుత్ బకాయిలు పంచాయతీలకు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెంటనే చెల్లించాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త నుంచి సంపద పెంచే కేంద్రాల షెడ్లను వేగవంతంగా నిర్మించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నిషేధం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రోడ్ల నిర్మాణాలకు అవసరమయ్యే ప్లాస్టిక్ వేరు చేసి వినియోగించే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ వచ్చే వారంలోపు ఈ పనుల్లో పూర్తి స్థాయి పురోగతి చూపిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ సంపూర్ణ పారిశుధ్యం దిశగా పంచాయతీ తీర్మానాలను 24 గంటల్లోపు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన భవన నిర్మాణాలతో పాటు, గహ నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని అన్నారు.

నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

నాడు-నేడు రెండవ దశ పనులను త్వరగా పూర్తి చేయాలని పాఠశాలల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పాఠశాలల క్షేత్రస్థాయి నిర్మాణాల కార్యదర్శి భాస్కర్‌తో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉన్నత స్థితి తీసుకెళ్లే విధంగా నాడు-నేడు కార్యక్రమాల ద్వారా అభివద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీ రాజ్ ఎస్ఇలు రషీద్, గోపాల రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఈవో మీనాక్షి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు

తప్పిన ప్రమాదాలు

ప్రజాశక్తి-బుక్కపట్నం/రొద్దం

బుక్కపట్నం, రొద్దం మండల కేంద్రాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల వరుసగా రెండు పెద్ద పెద్ద విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో విద్యుత్ స్తంబాలు అంటేనే ప్రజలు జడుసుకుంటున్నారు.

బుక్కపట్నం మండల కేంద్రంలోని పౌరసరఫరాల సంస్థ ప్రదేశంలో గురువారం ఉదయం ఒక్కసారిగా విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో కొన్ని చెట్లు కూడా పడిపోయాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఒక్కసారిగా రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరడంతోపాటు చెట్లు కూలిపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే స్థానికులు వెంటనే అప్రమత్తం కావడంతో పెద్దప్రమాదం తప్పినట్లయింది. కాగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ప్రమాదస్థాయిలో ఉన్నాయని, వాటిస్థానంలో కొత్త స్తంబాలు బిగించాలని సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టిచుకోవడం లేదని సర్పంచి, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకునొ తుప్పు పట్టిన స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను అమర్చించి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రొద్దం మండల కేంద్రంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో గురువారం పెను ప్రమాదమే తప్పింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో పెనుకొండ, పావగడ ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వచ్చాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో విద్యుత్ వైర్లకు తగిలి స్తంభం కింద పడిపోయింది. అయితే స్థానికులు వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇరుకుగా ఉంటుంది. దీనికితోడు దుకాణాల వద్ద వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెడుతూ ఉంటారు. దీంతో మరింత ఇరుకుగా మారుతూ ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన రహదారిపై వాహనాలను రోడ్డుకు అడ్డంగా ఉంచకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బుక్కపట్నంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



రొద్దం మండలంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నేలకొరిగిన విద్యుతథ స్తంభం



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి

అయ్యప్ప భక్తులకు అన్నదానం

గోరంట్ల : టిడిపి మైనార్టీ నాయకుడు ఉమర్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సరస్వతి విద్యామందిర్ సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో 500 మంది అయ్యప్ప మాల ధరించిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా అయ్యప్పస్వామికి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ సోమశేఖర్, జిల్లా కార్యదర్శి వేణురాయల్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి, నరేష్‌యాదవ్, నరేంద్రరాయల్, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మనోహర్, మాజీ డీలర్ వెంకటేష్, గురుస్వాములు తిప్పన్న, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న అయ్యప్ప సేవాకమిటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి ఉచిత కుట్లు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వామి సేవా కమిటీ కార్యాలయంలో శిక్షణ కేంద్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్..99590 83888, 90301 41216 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్రంలో కరువైన రక్షణ

కదిరి టౌన్ : రాష్ట్రంలో ఏ వర్గానికీ రక్షణ లేకుండా పోయిందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు అధికార పార్టీ నేతల దౌర్జన్యంగా ఇల్లు కూల్చేసిన బాధితులను పరామర్శించటానికి గురువారం విజయవాడ నుంచి కదిరికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు స్థిరాస్తి వ్యాపారుల నుంచి స్థలం కొనుగోలు చేసినప్పటికీ అధికార మదంతో అర్ధరాత్రి ఇమామ్‌బి, పార్వతమ్మకి చెందిన ఇల్లు, షెడ్డు కూల్చివేశారన్నారు. ఈనేపథ్యంలో వారికి భరోసా కల్పించేందుకే విజయవాడ నుంచి కదిరికి వచ్చామన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడు ఫైరోజ్‌అహ్మద్‌కు సన్మానం

గోరంట్ల : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడిగా ఎంపికైన పట్టణంలో ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఫైరోజ్ అహ్మద్‌ను గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఫైరోజ్‌అహ్మద్ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నబిరసూల్, పాఠశాల కమిటీ సభ్యులు అజ్మతుల్లా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్ పరికరాలు పంపిణీ

బుక్కపట్నం : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం సబ్సిడీ డ్రిప్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎపిఎంఐడి పీడీ సుదర్శన్ మాట్లాడుతూ ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, వ్యవసాయ అధికారి సతీష్‌బాబు, అగ్రి అడ్వైజర్ ఛైర్మన్ వెంకటచౌదరి, మైక్రో ఇరిగేషన్ అధికారి చెన్నకేశవులు, రైతు భరోసా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలతో గృహహింసను అరికడదాం

అంతర్జాతీయ స్త్రీహింస దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మహిళలపై రోజురోజుకూ పెరిగిపోతున్న గృహహింసను అరికట్టేందుకు కృషి చేద్దామని ఆర్డీటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఉషారాణి పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ గృహహింస కేసులు పెరిగిపోతున్నాయన్నారు. ఈనేపథ్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, ఎఎస్ఐ రంగనాయక్, ఆర్డీటీ ప్రతినిధులు నాగభూషణం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి కళ్యాణ మండపంలో ఆర్డీటీ ఎటిఎల్ వేమయ్య ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక చౌడేశ్వరీదేవి కళ్యాణ మండపం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి స్త్రీ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నసీమా, ఎడి ప్రకాష్‌రెడ్డి, ఎంఎన్‌డి క్రిష్టప్ప, సీవోలు, సీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో మాట్లాడుతున్న మహిళలు

తనకల్లు : అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్డీటీ ఆధ్వర్యంలో ఘనంగా మానవహారం నిర్మించారు. అనంతరం పివికె ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సీఒ, మహిళలు, విద్యార్థినులు మానవహారంగా ఏర్పడ్డారు.

మడకశిర : అంతర్జాతీయ స్త్రీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌డిటి ఎటిఎల్ నారాయణస్వామి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ కూడలి నుంచి జూనియర్ కళాశాల వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ హేమలత అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, కృష్ణయ్య, సిడిఎస్ సభ్యులు, ఆర్‌డిటి సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : అంతర్జాతీయ స్త్రీ నిర్మూలన దినోత్సవాన్ని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్డీటీ ఆధ్వర్యంలో సర్పంచి బండారు బాలమ్మ అధ్యక్షతన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి ఎటిఎల్ రుక్మాంగద, ఎసిటిఎల్ సుజాత, టీచర్ గీతశ్రీ, పిన్నదరి సర్పంచి సదానంద, ఎస్‌టిఎల్ శారద, ఆర్ఇ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



తనకల్లులో మానవహారం నిర్మించిన విద్యార్థులు, అధ్యాపకులు



తాడిమర్రి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పథకాలు

'గడప గడపకూ'లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వేపరాల సచివాలయ పరిధిలో ఉన్న సీఎం తండా, దళితవాడ, వేపరాల, తాళ్లకాలవ తదితర గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్ సిఎం అయ్యాక పేదల వద్దకే సంక్షేమం వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.అంజన్నప్ప, ఆర్ఐ అశోక్ చక్రం, ఎఒ లక్ష్మీప్రియ, ఎంపిపి టి.జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్‌అలీ, ఎంపిటిసి జి.సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఉమాదేవి, రవీంద్రనాయక్, ఆంజనేయులు, ఆర్‌బికె ఛైర్మన్ శంకర్‌నాయుడు, పామిడి మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్, ఫరూక్, లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంట మండలంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

రొద్దం : మండలంలోని చోలేమర్రిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు, ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, కలిపి శ్రీనివాసులు, రాజారెడ్డి, కన్వీనర్ బోయ తిమ్మయ్య, ఎంపిటిసిలు సర్పంచులు, స్థానిక నాయకులు, తదితరులఉ పాల్గొన్నారు.

మురికివాడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘంలోని మురికివాడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గురువారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఆటోనగర్ ప్రాంత ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆటోనగర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆటోనగర్ అభివృద్ధి జరగలేదన్నారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ఆర్థికలోటు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరుస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆటోనగర్‌లో రూ.97.50లక్షలతో మురుగు కాలువల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. దీంతో పాటు సిసి రోడ్లు, విద్యుత్ దీపాలతో ఇతర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీలో సైతం మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు సునీత, వెంకటేశ్వర్‌రెడ్డి, రహమాత్‌బీ, ఆటోనగర్‌వాసులు పాల్గొన్నారు.



ఆటోనగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

ప్రిన్సిపల్ ప్రగతి

హిందూపురం : విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా మహిళా కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు పని చేస్తున్నారని ఎన్‌ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.ప్రగతి కోరారు. గురువారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో వారి కుమార్తెలను చేర్పించనందుకు తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకానికి తగినట్లుగా అధ్యాపకులు అంకిత భావంతో విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కంప్యూటర్ క్లాసులు, పోటీ పరీక్షల కోసం క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, డిప్యూటీ వార్డెన్ సరస్వతి, అధ్యాపకులు వెంకటేశులు, శ్రీలక్ష్మి, యశోదా రాణి, భోజప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రగతి

రైతులకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి

ప్రజాశక్తి-పరిగి

సచివాలయం, రైతు భరోసా సిబ్బంది రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని 1వ రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా సచివాలయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ తరపున రైతులకు ఇస్తున్న ప్యాక్‌హౌస్, డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, మల్బరీ షెడ్లు, మల్బరీ పంటలకు ఇస్తున్న సబ్సిడీలపై రైతులకు వివరించాలన్నారు. అలాగే గ్రామ, మండల స్థాయి సలహా మండలి సమావేశాల్లో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి తగిన పరిష్కారాలు చూపాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్‌అలీఖాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, సనావుల్లా, మండల వ్యవసాయాధికారిణి విజయభారతి, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్‌కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ మారుతిరెడ్డి, కాణిపాకం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మారుతీశ్వరరావు, డివిజన్ స్థాయి సలహా మండలి ఛైర్మన్ బసిరెడ్డి, ఎంపిటిసి అమరావతి, నారాయణరెడ్డి, ఆర్‌బికె సిబ్బంది, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి

లక్ష దీపోత్సవం పోస్టర్ల విడుదల

మడకశిర రూరల్ : నియోజకవర్గంలోని హేమావతి గ్రామంలో వెలిసిన సిద్దేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 8న నిర్వహించనున్న లక్ష దీపోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే తిప్పేస్వామి స్వగృహంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష దీపోత్సవానికి విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పలువురికి 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-ఒడిచెరువు

మండల పరిధిలోని కొండకమర్ల, చింతమానుపల్లి గ్రామ పంచాయతీల్లో మాజీమంత్రి పలువురు బాధితులను పరామర్శించడంతోపాటు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా చింతమానుపల్లి గ్రామ పంచాయతీలో మృతిచెందిన ఇండ్లూరి రామచంద్రప్పనాయుడు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మల్లెలవాండ్లపల్లికి చెందిన అశోక్ తల్లిదండ్రులను పరామర్శించి రూ.4వేలు, కొండకుమార్లలో టిడిపికి చెందిన భూపతి శ్రీనివాసులు ఆవు మృతిచెందడంతో ఆర్థికసాయం అందించారు. ఈశ్వరీమాల ధరించిన ఐదుగురు మహిళలకు రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటరీ తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ జాకీర్‌అహ్మద్, రాజారెడ్డి, షఫీ, అహ్మద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, జయచంద్రారెడ్డి, కొండే ఈశ్వరయ్య, ఎస్.గంగాద్రి, మాజీ స్టోర్ డీలర్ చంద్రాయుడు, సంఘాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ఆర్థికసాయం అందజేస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

రైతుసదస్సును జయప్రదం చేయండి

హిందూపురం : ఈనెల 30న జరిగే గ్రేటర్ రాయలసీమ రైతు సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గ్రేటర్ రాయలసీమ రైతుసంఘం ఆధ్వర్యంలో 30న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలో రైతు సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులో పెద్దఎత్తున రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ గ్రూపు-ఎ క్రీడాపోటీల్లో ధర్మవరానికి చెందిన కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్కేయూ పరిధిలోని అంతర్ కళాశాలల గ్రూపు-ఎ క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫైనల్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల, కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు తలపడగా కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచి అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్, పీడీ ఆనంద్, అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి ముఖ్యఅతిథిగా హాజరై 19మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆది, కార్యదర్శిగా అబ్రార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, అనిల్‌కుమార్, పవన్, సతీష్, దాదాపీర్, సహాయ కార్యదర్శులుగా నాగేంద్రబాబు, గోవర్ధన్, కిరణ్, ముబారక్, ఆసీఫ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అశ్వత్, నారాయణ, జయకృష్ణ పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

నేరాలు ఘోరాలు

యువకుడి అనుమానాస్పద మృతి

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో చాకలి చంద్ర రెండవ కుమారుడు డి.శ్రీనాథ్ (22) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శ్రీనాథ్ మదనపల్లిలోని నీరుగుట్టుపల్లిలో మామ దగ్గర మగ్గం నేస్తుండేవాడు. అయితే రెండు రోజుల క్రితం స్వగ్రామం కొక్కంటి క్రాస్‌కు వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో మృతి చెంది కనిపించాడు. ఇరుగు పొరుగువారు గమనించి తల్లిదండ్రులకు ఫోన్ చేయగా వారు వచ్చి బోరనవ విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంభూపాల్‌యాదవ్ తెలిపారు.



మృతిచెందిన శ్రీనాథ్

నీటిలోపడి వ్యక్తి మృతి



మృతిచెందిన గంగన్న

అమడగూరు : మండల పరిధిలోని దూదరగుట్టపల్లి గ్రామానికి చెందిన ఉద్దాలా గంగన్న (57) గురువారం మధ్యాహ్నం దుస్తులు ఉతకడానికి చెక్‌డ్యామ్ వద్దకెళ్లి అక్కడ నీటిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గంగన్న దుస్తులు ఉతకాడానికి గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యంలో మూర్ఛవ్యాధి రావడంతో నీటిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. గమణించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ వెంకటనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలు తీసుకుని విచారించాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ధర్మవరం టౌన్ : బండరాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన గురువారం ధర్మవరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు.. బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రామంజినేయులు, అదేగామానికి చెందిన సాకే కేశప్ప, సుధాకర్, సిద్దరాంపురం గ్రామానికి చెందిన చరణ్ ట్రాక్టర్‌లో బండరాళ్లు వేసుకుని ధర్మవరానికి వస్తున్నారు. పట్టణంలోని ఎరగుంట సర్కిల్‌లోకి రాగానే ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చరణ్, సాకే కేశప్ప, సుధాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చరణ్‌కు రెండుకాళ్లు విరగడంలో పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలలను సాకారం చేసుకోవాలి

ఐకెపి ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య

ఓబుళదేవరచెరువు : మహిళా సంఘాల సభ్యులు తమ కుటుంబ ఉజ్వల భవిష్యత్తు కోసం కలలు కనడంతోపాటు సాకారం చేసుకోవాలని ఐకెపి ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పల్లవి మండల సమైక్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్, భవిష్యత్ కార్యాచరణపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు నెలవారి స్థిరమైన ఆదాయాన్ని పొందేందుకు ప్రణాళికాబద్ధంగా ఒక మంచి కార్యక్రమాన్ని ఎంచుకోవాలన్నారు. సభ్యులు సమైక్య నుంచి పొందిన పెట్టుబడి నిధిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం నాగరాజు, ఏరియా కోఆర్డినేటర్ రామ్మోహన్, ఎపిఎం రమణప్ప, పల్లవి, మండల సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

27న కురుబల మహాసభ

కొత్తచెరువు : ఈనెల 27వ తేదీ పుట్టపర్తిలో నిర్వహించనున్న కురుబల మహాసభను విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ, శివానంద, తలమర్ల కమ్మన్న, చెన్నరాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని నారేపల్లి, కేశపురం, మైలుసముద్రం గ్రామాల్లో ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగడి ప్రభాకర్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, మంజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వికలాంగులు

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ పని తీరును నిరసిస్తూ పలువురు వికలాంగులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 650 మంది వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్‌లో భాగంగా తాత్కాలిక డాక్టర్ సర్టిఫికెట్లు పొందివారు, ప్రమాదాలు జరిగినవారు, మూర్ఛవ్యాధి వచ్చేవారు తప్పకుండా రీ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈనేపథ్యంలో కంచిసముద్రం పంచాయతీ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెరిఫికేషన్ చేయించుకునేందుకు వస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

సిడిపిఒ శాంతలక్ష్మి

పుట్టపర్తి రూరల్ : పట్టణాలతోపాటు ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సిడిపిఒ శాంతలక్ష్మి సూచించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో గురువారం పుట్టపర్తి సెక్టార్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త అంగన్వాడీ కేంద్రాలను ప్రతిష్టాత్మకంగా నడపాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని, డిసెంబర్‌లో నిర్వహించాల్సిన పెరుగుదల పర్యవేక్షణ ప్రత్యేక డ్రైవ్‌లో 0 నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ బరువులు, ఎత్తులు తీయాలన్నారు. బాలింతలు, గర్భవతులకు అందించే పౌష్టికాహారంలో ఆలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మంజుల, నర్మద, ఉమ, జ్యోతి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.